సాక్షి
బాపట్ల
శుక్రవారం ¦ 5 ¦ జూలై ¦ 2024



అల్లూరికి నివాళి

చిలకలూరిపేట: ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గురువారం ఆయన జయంత్యుత్సవాన్ని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు.



విత్తన దుకాణాల తనిఖీ

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని విత్తన దుకాణాలు, గ్రోమోరు సెంటర్‌ను గురువారం ఏఓ వాసంతి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, కొనుగోలు రిజిస్టర్‌లను పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 503.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు సత్తెనపల్లి పట్టణంలోని సుగాలికాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 5న సాయంత్రం 4 గంటలకు జరుగుతాయని ఫుట్‌బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2008 జనవరి నుంచి 2010 డిసెంబర్ మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. పాల్గొనే వారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్ ఫొటోలతోపాటు తల్లిదండ్రుల సమ్మతి పత్రం వెంట తీసుకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు 97010 52588 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌పై వైఎస్సార్ పేరుకు పసుపురంగు



అచ్చంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.కోట్లాది రూపాయలతో గ్రామగ్రామాన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలను చేరువ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ క్లినిక్‌లకు వైఎస్సార్ పేరు ఉండడాన్ని జీర్ణించుకోలేకపోయిన టీడీపీ నాయకులు చామవరం గ్రామంలోని క్లినిక్ వద్ద బోర్డుపై ఉన్న వైఎస్సార్ పేరుపై బుధవారం రాత్రి పసుపు రంగు పూశారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోయినా స్థానిక వైద్య సిబ్బందికీ తెలియకుండా ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఆరోగ్యశ్రీ, 108 వంటి మహోన్నత పథకాలను ప్రవేశపెట్టిన తమ ఆరాధ్య నాయకుడు వైఎస్సార్ పేరుపై పసుపురంగు పూయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యార్డులో 33,108 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,752 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,108 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,200 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,500 నుంచి రూ.19,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,419 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వర్సిటీలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



ఏఎన్‌యూ : అసమర్థ జాతీయ స్థాయి పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థి సంఘాలు నిర్వహించిన బంద్ నాగార్జున యూనివర్సిటీలో సంపూర్ణంగా జరిగింది. తరగతులు జరగకుండా నాయకులు పర్యవేక్షించారు.

జాతీయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2024కు అర్హుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈనెల 15లోపు సమర్పించాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందేలా కృషి

జిల్లా కలెక్టర్‌గా జె.వెంకట మురళి బాధ్యతలు

బాపట్ల: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్‌గా కలెక్టరేట్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి చార్జ్ తీసుకున్నారు. కలెక్టరేట్‌లో మేళతాళాలతో ఆయనకు ఘనంగా ఆహ్వానం లభించింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాను మరింత అభివృద్ధిలోకి తీసుకువెళ్లడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలంతా కలిసి పని చేద్దామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్దేశం మేరకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంత్రులతో కలిసి చర్చించామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, లక్ష్యాల్ని అధిగమించేలా యంత్రాంగం టీం వర్క్‌గా పని చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం, ప్రజల ఆకాంక్షలకు తగినట్టుగా ఉద్యోగులంతా క్రమశిక్షణ, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని ఆయన చెప్పారు. ముఖ్యంగా బాపట్ల జిల్లాలో అన్ని వనరులు లేవని విధుల్లో రాజీ పడరాదని తెలిపారు. నిజాయతీ, బాధ్యతతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ చేరువయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన్ను అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, జిల్లా అధికారులు, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ చామకూరి శ్రీధర్‌కు సాదర వీడ్కోలు

బాపట్ల: జిల్లా సంయుక్త కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్ నిబద్ధతతో పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రశంసించారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనతో పాటు పదోన్నతిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా వెళ్తున్న చామకూరి శ్రీధర్‌కు వీడ్కోలు సభను గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్‌ను, కలెక్టర్ వెంకట మురళితో పాటు జిల్లా అధికారులు, ఉద్యోగులు కలిసి బహుమతులు, జ్ఞాపికలు, పుష్పమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. నూతన కలెక్టర్‌కు ఘనంగా ఆహ్వానం పలుకుతూ సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగంలో కష్టనష్టాల్ని ఒకేలా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. విధి నిర్వహణలో ప్రణాళిక, లక్ష్యం ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగంలో జవాబుదారీతనంతో ఎలా పని చేస్తామో.. వ్యక్తిగత జీవితానికీ అంతే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. నిబద్ధతతో పనిచేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని చెప్పారు. నైపుణ్యాలున్న వారికి సూచనలు చేస్తే పరిపాలన సులభతరం అవుతుందని సూచించారు. బాపట్ల జిల్లా ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు, అధికారులు, ఉద్యోగుల సహకారం ఎన్నటికీ మరువలేనని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బాపట్ల జిల్లా ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో బాపట్ల జిల్లా ఒకటి నుంచి మూడు స్థానాల్లో నిలిచేదని చెప్పారు. ఉన్నత ఆశయంతో అధికారులు, ఉద్యోగులు కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. అధికారులంతా బాధ్యతతో పనిచేయడం ద్వారానే అన్నింటిలో జిల్లా పురోగతిలో పయనించిందని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరవేయడంలో అధికారుల పాత్ర అభినందనీయమని తెలిపారు. ఎన్నికలలో సహకారం మరువలేనిదని కొనియాడారు. ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రభుత్వ ఉద్యోగంలోనే ఉంటుందని, ఇష్టంతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాల్ని సాధించవచ్చని స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. మంచి ఆశయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. పరిపాలన వ్యవస్థలో అధికారులందరినీ సమన్వయం చేసుకోవాలని సూచించారు. బాపట్ల జిల్లాలో మంచి పేరు తెచ్చుకున్న అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్ నిలిచారని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు అన్నారు ప్రజలలో మంచి పేరు తెచ్చుకున్నారని కితాబిచ్చారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు, జి. రవీందర్ జి. సూర్యనారాయణరెడ్డి, హేలా షారోన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట మురళి

స్వాతంత్య్రోద్యమానికి అల్లూరి బీజం

బాపట్ల: స్వాతంత్య్ర ఉద్యమానికి అల్లూరి సీతారామరాజు రాష్ట్రంలో బీజాలు వేశారని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకట మురళి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా పద్మనాభ మండలం పాండ్రంగి గ్రామంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రాణాల్ని పణంగా పెట్టి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ప్రజా ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకుడి జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరపడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, బాపట్ల ఆర్డీవో జి. రవీందర్, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిణి జె. రాజదిబోరా, కలెక్టరేట్ ఏవో లక్ష్మీకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జేసీ శ్రీధర్‌కు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, సిబ్బంది



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, సిబ్బంది

వైఎస్సార్ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు



మార్టూరు: వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామ నడిబొడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహం చేతులు, తలభాగాన్ని నాశనం చేశారని సీఐ రాజశేఖర్‌రెడ్డికి ద్రోణాదుల సొసైటీ చైర్మన్ మాగులూరి రాధాకృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. నిందితుల్ని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, మున్ముందు ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ద్రోణాదుల ఎంపీటీసీ సభ్యులు పెంటేల సురేష్ బాబు, పార్టీ మండల కన్వీనర్ పఠాన్ కాలేషా వలి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, ఎస్సీ సెల్ కన్వీనర్ అట్లూరి సుకుందరావు సులేమాన్ చిన్న బుడే పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు ఏపీ టెట్ ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: మైనార్టీల ప్రాంతీయ విద్యాభివృద్ధి కేంద్ర (ఆర్సీఈడీఎం) ఆధ్వర్యంలో ఏపీ టెట్‌కు సన్నద్ధమవుతున్న మైనార్టీ విద్యార్థులకు పొన్నూరురోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ మస్తాన్‌వలి గురువారం పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి జరగనున్న ఉచిత శిక్షణ కోసం టెట్–2024 ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం జిరాక్స్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఆంధ్ర ముస్లిం కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 90308 72696, 94414 53256, 81259 07579 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మహోన్నత వ్యక్తి కొణిజేటి రోశయ్య

మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల అర్బన్: రాజకీయాలలో మకుటం లేని మహారాజుగా కొణిజేటి రోశయ్య నిలిచారని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతిని గురువారం నిర్వహించారు. స్థానిక ఎంజీసీ మార్కెట్ ముందున్న ఆయన కాంస్య విగ్రహానికి కరణం బలరామకృష్ణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోశయ్య ఛలోక్తులతో అసెంబ్లీని మంచి వాతావరణంలో నడిపించారని తెలిపారు. వయస్సులో ఆయన కన్నా చిన్నవాడినైన తనకు మంచి సలహాలు ఇస్తుండేవారని గుర్తు చేసుకున్నారు. దేశంలో 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందని పేర్కొన్నారు. వైఎస్సార్ మరణానంతరం ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా, తర్వాత తమిళనాడు గవర్నర్‌గా అవిరళ సేవలందించారని తెలిపారు. అనేక హోదాల్లో పని చేసిన ఆయన నిరాడంబరంగా ఉండేవారని అన్నారు. చీరాల ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. వయస్సులో అందరి కన్నా పెద్ద వ్యక్తిగా ఉన్న ఆయన్ను అందరూ 'పెద్దాయన' అని ఆప్యాయంగా పిలిచేవారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో అందరం ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్లు మామిడాల రాములు, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- ఎంజీసీ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో మార్కెట్‌కు ఉన్న అనుబంధాన్ని, అనుభవాల్ని పాలకవర్గ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో ఎంజీసీ మార్కెట్ అధ్యక్షులు వేముల చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షులు పోలిశెట్టి వేణుగోపాలరావు, గుర్రం రాఘవరావు, కార్యదర్శి తాతా కుమారస్వామి, అచ్చుత శ్రీనివాసరావు, పల్లపోగు వెంకటసుబ్బయ్య గుప్త, కోశాధికారి తడవర్తి హనుమంతరావు, టీటీఎంఏ ఉపాధ్యక్షులు నాళం సత్యనారాయణ, వి.శ్యాంప్రసాద్, కార్యదర్శులు కోట శ్రీమన్నారాయణ, వేమా బ్రహ్మానందం, కె.హరికిషన్, కోశాధికారులు పేరకం సాంబశివరావు, సంకా రవికుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి చిన్ని లీలాధరరావు, రవి పార్సిల్ అధినేత తిరువీధుల రవికుమార్, వూటుకూరి ఏకాంబరేశ్వరరావు, చారుగుళ్ల గురుప్రసాదరావు, ఎం.వెంకటేశ్వర్లు, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బలరామకృష్ణమూర్తి, నేతలు

అంతర రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

- రూ.2.26 లక్ష విలువ గల ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితుడు ఏరోనాటికల్ ఇంజినీర్

చీరాల రూరల్: అతను ఉన్నత విద్యను అభ్యసించాడు. నలుగురికి స్ఫూర్తినివ్వాల్సింది పోయి దొంగగా మారాడు. జల్సాలకు అలవాటుపడిన ఓ ఏరోనాటికల్ ఇంజనీర్ రైళ్లలో సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తున్నాడు. వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసూ తిరుగుతున్న అంతర రాష్ట్ర దొంగను చీరాల జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్టు చేసి కటకటాల వెనక్కు నెట్టారు. గురువారం రైల్వే డెప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్. విజయ భాస్కర్, ఎస్‌ఐ కొండయ్యలు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ కె. చౌడేశ్వరి ఆదేశాల మేరకు ఒంగోలు జీఆర్పీ సీఐ ఎస్. శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో చీరాల జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్. కొండయ్య గురువారం చీరాల నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓవ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా, అతని వద్ద ఆరు సెల్‌ఫోన్లు దొరికాయి. వీటి విలువ రూ.2,26,898 విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు.

నిద్రిస్తున్న ప్రయాణికులే లక్ష్యం

నిందితుడు కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన ఇల్లూరు హరినాథ్‌రెడ్డి. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదువుకుని ఉద్యోగం లేక ఖాళీగా తిరుగుతున్నాడు. అందినకాడికి డబ్బులు ఖర్చుచేస్తూ జులాయిగా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో చిన్నచిన్న దొంగతనాలకు అలవాటుపడ్డాడు. రైళ్లలో తిరుపతి నుంచి తెనాలి వరకు ప్రయాణిస్తూ ప్రయాణికులు ఆదమరచి నిద్రించే సమయంలో వారి సెల్‌ఫోన్లు దొంగిలిస్తాడు. వాటిని బెంగుళూరు, గోవా వంటి ప్రాంతాలలో విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నాడు. డబ్బులు అయిపోయాక మరలా రైళ్లలో తిరుగుతూ సెల్‌ఫోన్లు దొంగిలిస్తూ, విక్రయించి జల్సాలు చేస్తున్నాడు. చివరికి చీరాల రైల్వే స్టేషన్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో పట్టుబడి కటకటాలలోకి వెళ్లాడు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ సీహెచ్. కొండయ్య, హెచ్ కానిస్టేబుల్ కె. భాస్కరరావు, కానిస్టేబుళ్లు రాము, గోపీలను రైల్వే అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ అభినందించారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్‌ఐ కొండయ్య

రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి

జే.పంగులూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతిచెందిన సంఘటన బాపట్ల జిల్లా జే.పంగులూరు మండల పరిధిలోని కశ్యాపురం గ్రామ శివారులో అద్దంకి రోడ్డు మార్గంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రేణింగవరం పోలీసులు ఈ మేరకు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసరావు, శిక్షణ అధికారి వై.జన్సన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడికి సమీపంలో జింక కళేబరాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ మధ్య భగవాన్ రాజుపాలెం వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు చుక్కల దుప్పులు చనిపోయాయని తెలిపారు. దుప్పులు తిరిగే ప్రాంతాల్లో వాహనాలు జాగ్రత్తగా నడపాలని ప్రజల్ని కోరారు. వీటికి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హాని తలపెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



విద్యతో పాటు వ్యవసాయంపై అవగాహన అవసరం

ఆత్మ డీపీవో వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: విద్యతోపాటు వ్యవసాయంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) డీపీవో వెంకటేశ్వర్లు సూచించారు. ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ (ఎస్‌ఎస్‌హెచ్‌పీ) కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్డీవారిపాలెం జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గురువారం వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణ తదితర అంశాల్ని వివరించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ నేలను, అందులోని సారాన్ని పరిరక్షించకుంటే సాగు చేసే ఏ పంటలో అయినా అధిక దిగుబడులు, నాణ్యత లభిస్తాయన్నారు. రసాయన ఎరువుల వినియోగం ద్వారా కాకుండా సేంద్రియ పద్ధతుల్లో భూసారాన్ని పెంచుకుంటే ఆరోగ్యవంతమైన వాతావరణంతో పాటు కాలుష్యాన్ని నివారించవచ్చని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయంలో మెలకువలను తెలుసుకుంటుండాలని చెప్పారు. ఈ రంగంలోనూ అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నేల సంరక్షణ, భూసారాన్ని పెంపొందించుకునే విధానంతో పాటు మట్టి నమూనాల సేకరణ తదితర అంశాలపై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం బి.మాధవి, మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు, గుంటూరు డీఆర్‌సీ ఏవో రాజవంశీ, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.ప్రభాకరరావు, ఎంఎస్‌టీఎల్ ఏవో వెంకటేష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సుమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణను వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మత్స్యకారుల జీవనోపాధిపై నిర్లక్ష్యం తగదు

- ఫైబర్ నావలు, తెప్పల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి జాలరాజు
- మత్స్యకార భరోసా వెంటనే అందించాలి

నిజాంపట్నం: మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని శక్తి స్వరూప ఫైబర్ నావలు, తెప్పల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి జాలరాజు తెలిపారు.నిజాంపట్నంలోని బోట్ల రేవు వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏటా చేపల వేట నిషేధ సమయంలో జీవనోపాధి కోసం ప్రభుత్వం ఇచ్చే మత్స్యకార భృతి ఇప్పటి వరకూ అందించక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. గతంలో రూ.4వేలు ఉన్న భృతిని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ. 10లకు పెంచి అందించారని చెప్పారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం మే నెలలోనే భృతిని అందించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ దాని ఊసెత్తకపోవడం దారుణమని ఖండించారు. మత్స్యకార భరోసా రూ.20వేలు ఇస్తామని వాగ్దానం చేయడంతో మత్స్యకారులందరూ కూటమి ప్రభుత్వానికి ఓటువేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి మత్స్యకార భరోసాను వెంటనే విడుదల చేయాలని కోరారు.కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సున్నంపూడి అక్కేశ్వరరావు, ఉపాధ్యక్షుడు విశ్వనాథపల్లి రామారావు, మోపిదేవి వెంకటేశ్వరరావు, బొమ్మిడి ప్రసాద్, పీతా వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, మోపిదేవి నాగార్జున, శ్రీను, గోవిందు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాలరాజు

రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శనివారం నుంచి ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆషాఢ శుద్ధ పాడ్యమి అయిన శనివారం నుంచే వారాహి నవరాత్రులు ప్రారంభించేందుకు దేవస్థాన వైదిక కమిటీ నిర్ణయించింది. నెల రోజుల ఆషాఢ మాసంలో లోక కల్యాణార్థం జగన్మాత శ్రీదుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. శనివారం ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి అలంకరణ, నిత్య పూజల అనంతరం తొలి సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. అదే సమయంలో వారాహి నవరాత్రులను పురస్కరించుకుని కలశ స్థాపన, అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు వచ్చే భక్తులు, ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలు, భజన బృందాలు, దేవాలయాల కమిటీలను ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడంతో పాటు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆలయ ఈవో కె.ఎస్.రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై గురువారం ఈవో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

అల్లూరి జీవితం యువతకు ఆదర్శం

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ

బాపట్ల టౌన్: అల్లూరి సీతారామరాజు జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారతదేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన విప్లవకారుడని పేర్కొన్నారు. బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతూ వారికి కంటిమీద కునుకులేకుండా చేశాడని తెలిపారు. విప్లవాన్ని అణచివేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజల్ని హింసిస్తుండడంతో, ప్రాణ త్యాగానికి సిద్ధపడి 1924 మే 7న విశాఖపట్నం జిల్లా మంప గ్రామానికి సమీపాన లొంగిపోయారని వివరించారు. ఆంగ్లేయుల తూటాలకు తుదిశ్వాస విడిచి శాశ్వత నిద్రలోకి వెళ్లారన్నారు. గొప్ప వ్యక్తుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు, యువత నాయకత్వ లక్షణాల్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. సమాజంలో జరిగే అన్యాయాల్ని ఎదిరించి మంచివైపు నిలబడాలని తెలిపారు. సమాజంలో నేరాల్ని అదుపు చేయడానికి పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాస్‌రెడ్డి, అడ్మిన్ ఆర్ఐ షేక్‌మౌలుద్దీన్, సీఐ శ్రీనివాసరెడ్డి, డీపీవో, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి యువతరానికి అల్లూరి స్ఫూర్తి ప్రదాత

పిట్టలవానిపాలెం: నేటి యువతరానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ప్రదాత అని పిట్టలవానిపాలెం క్షత్రియ సేవా సంఘం నాయకులు అల్లూరి శివరామరాజు చెప్పారు. మండల కేంద్రంలోని ఐలాండ్ సెంటర్‌లో గురువారం విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివరామరాజు మాట్లాడుతూ భరతమాత దాస్య శృంఖలాల్ని తెంచడానికి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై ప్రత్యక్షసాయుధ పోరుకు తెరలేపి, తెలుగుజాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. తొలుత అల్లూరి విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహ హింసపై కేసు నమోదు

వేమూరు: భర్త గృహ హింసపై ఓ వివాహిత ఫిర్యాదు మేరకు వేమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వేమూరు గ్రామానికి చెందిన గుర్రం సుధీర్‌బాబు మొదటి భార్య అనారోగ్యంతో చనిపోవడంతో దివ్యను రెండో వివాహం చేసుకున్నాడు. సుధీర్‌బాబుకు ఇద్దరు మగ పిల్లలున్నారు. ఇద్దరినీ దివ్య బాగా చూసుకుంటున్నా కూడా సంతృప్తి చెందేవాడు కాదు. ఆమెపై అనుమానంతో శారీరంగా, మానసికంగా వేధించేవాడు. దీన్ని భరించలేక దివ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

ఆర్డీఓ పి.శ్రీకర్



గుంటూరు వెస్ట్: గర్భస్థ లింగ నిర్ధారణలో స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాల్సిందేనని, అతిక్రమించే వారిని డొకాయ్ ఆపరేషన్స్ ద్వారా గుర్తించాలని ఆర్డీఓ పి.శ్రీకర్ తెలిపారు. గురువారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు, మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలలో ఐఈసీ బోర్డులు పెట్టాలన్నారు. సమాజ హితం కోరి ప్రభుత్వం ఏర్పాటు చేసే నిబంధనలు పాటించడం సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, వైద్యులు పాల్గొన్నారు.

అమరావతి రక్షణ కోసం హనుమాన్ చాలీసా



అనంతవరం (తాడికొండ): అమరావతి రాజధాని మహానగరం నిర్మాణంతోపాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంతో గురువారం తుళ్లూరు మండలం అనంతవరంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా గాన యజ్ఞం నిర్వహించారు. జాతీయ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో కంచి కామకోటి శంకర మఠం పీఠాధిపతులు జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో గీతా పారాయణం, అష్టోత్తర శత హనుమాన్ చాలీసా గాన యజ్ఞం వైభవంగా నిర్వహించారు.


ప్రైవేట్ పేమెంట్ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు బంద్

- ఏపీసీపీడీసీఎల్ యాప్, లేదా వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాలి
- ఈనెల నుంచి ఆర్‌బీఐ కొత్త నిబంధన
- జూలై 1 నుంచే అమలు

సత్తెనపల్లి: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీ సీపీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా సంస్థ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మాత్రమే బిల్లులు చెల్లించాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, ఇతరత్రా వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపి వేసినట్లు వెల్లడించింది. విద్యుత్ శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని వినియోగదారులకు సూచిస్తోంది. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటుంది. ఇకపై ఇలా చేయడం కుదరదని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ నిబంధనలు

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే కాలం పోయింది. గతంలో కంటే ప్రస్తుతం ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీస్ చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే ఈనెల ఒకటి నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వులు మేరకు ప్రస్తుతం బిల్లు పేమెంట్ ఆప్షన్‌ను యాప్‌లు తొలగించేశాయి.



ప్రత్యక్ష చెల్లింపులు చేయాలని విద్యుత్ శాఖ సమాచారం

కారణం ఇదీ..

ఆన్లైన్ చెల్లింపుల్లో మూడో పార్టీ యాప్స్ అయిన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, ఇతరత్రా వాటిలో కరెంట్ బిల్లు చెల్లిస్తే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజులు సమయం పడుతుంది. కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడం ఆలస్యమవుతోంది. అదే ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్ చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే వెళ్తుంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఏపీ సీపీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధన విధించింది. అందులో భాగంగా యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అవి పూర్తయ్యాక పాత విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న ఏపీ సీపీడీసీఎల్ అనే యాప్ ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని నేరుగా బిల్లులు చెల్లించుకోవచ్చు. వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి అనుకుంటే httpr://apcpdc.in ఐ ద్వారా పేమెంట్ చేసుకునే అవకాశం ఉంది.

80 శాతం ఆన్‌లైన్..

జిల్లాలో దాదాపు 80 శాతం మంది వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. జిల్లాలో గృహ, వాణిజ్య సర్వీసులు 7,48,449, హెచ్‌టీ సర్వీసులు 594 ఉన్నాయి. నెలకు ఎల్‌టీ విద్యుత్ వినియోగం 309.6 మెగా యూనిట్లు కాగా నెలకు హెచ్‌టీ విద్యుత్ వినియోగం 179.17 మెగా యూనిట్లుగా ఉంది. నెలకు ఎల్‌టీ విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ. 51.12 కోట్లు, నెలకు హెచ్‌టీ విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ.87.72 కోట్లుగా ఉంది.

వినియోగదారులు సహకరించాలి

విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు బిల్లులు చెల్లించాలి. ఈనెల ఒకటి నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశాం. విద్యుత్ వినియోగదారులు సహకరించాలి. కరపత్రాల ద్వారా దీనిపై పూర్తి స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించనున్నాం.

–కొచ్చర్ల రాజశేఖర్ బాబు, ఏడీఈ, సత్తెనపల్లి

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు 350 మంది హాజరు



సర్టిఫికెట్‌లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ చిన్న వెంకటేశ్వర్లు

తెనాలి అర్బన్: వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ టెక్నికల్ విద్యకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని చెప్పారు. కోర్సు పూర్తయ్యే నాటికి విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చదువుతున్న 350 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వీరికి చదువు పూర్తయిన తర్వాత సదరు సంస్థలు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమర్ బ్యాటరీస్, ఎన్ఎస్‌సీ టెక్స్‌టైల్స్, జోసిల్, ఐటీసీ, టీవీఎస్, బ్లూస్టార్, ఈక్విక్‌డైస్ తదితర సంస్థల ప్రతినిధులు, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ టి ఇమ్మానుయేలు, ఎ. రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బసవయ్య



బసవయ్యకు నియామక పత్రం అందజేస్తున్న కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి రూరల్ మండలం బేతపూడి గ్రామానికి చెందిన ఉన్నం బసవయ్య నియమితులయ్యారు. గురువారం మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామక పత్రాన్ని ఉన్నం బసవయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా బసవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యల్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల్ని అర్హులకు అందేలా ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేమళ్ల సాంబశివరావు, నాయకులు నూతక్కి అమరయ్య, కురగంటి చిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి వాసనల కథకుడు కాట్రగడ్డ దయానంద్



పండుటాకు- గుండ్లకమ్మ తీరాన కథా సంపుటి పుస్తకావిష్కరణ సభలో అతిథులు

నగరంపాలెం: మధ్యతరగతి జీవితాలకు, రైతుల వెతలకు అద్దం పట్టే కథల రచయిత కాట్రగడ్డ దయానంద్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బృందావన్ గార్డెన్ శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి , వీవీఐటీ 30వ ప్రచురణ అయిన 'పండుటాకు- గుండ్లకమ్మ తీరాన' పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, సభకు ప్రముఖ అనువాదకుడు కందిమళ్ల శివప్రసాద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ పాపినేని శివశంకర్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని విశిష్ట అతిథిగా హాజరైన విజయవాడ పోస్ట్‌మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్ మూర్తికి అందజేశారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలకుపైగా సాహిత్య సేద్యం చేస్తున్న కాట్రగడ్డ దయానంద్ అభినందనీయులని అన్నారు. మట్టి వాసనల కథకుడు అని కొనియాడారు. ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా వాసిరెడ్డి విద్యాసాగర్, ఆత్మీయ అతిథిగా వాసిరెడ్డి నవీన్ హాజరయ్యారు. సభలో కాట్రగడ్డ జయలక్ష్మి, చైతన్య, వసంత, కారుణ్య, నిహారిక, శాన్విక, వేదామృత, నిహారిక, ధృవ్ రామ్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా బాలికల జట్టు ఎంపిక



పెదకాకాని మండలం ఉప్పలపాడు జెడ్పీస్కూల్‌లో జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ బాలికల జట్టుకు ఎంపికైన వారితో సెక్రటరీ దుర్గాప్రసాద్ తదితరులు

పెదకాకాని: రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచి ఫుట్‌బాల్ కప్ సాధించడమే లక్ష్యమని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ దుర్గాప్రసాద్ అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జిల్లా జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికలో జిల్లా స్థాయిలో ఆయా ప్రాంతాల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనపరచి బాలికలు 18 మందితో జిల్లా ఫుట్‌బాల్ జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేశారు. 11 మంది ప్లేయర్స్, ఏడుగురు ఎక్స్‌ట్రా ప్లేయర్స్ పాల్గొనే జట్టులో ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 15 మంది బాలికలు, సత్తెనపల్లి బాలికల పాఠశాల నుంచి ఒకరు, హోలీఫ్యామిలీ స్కూల్ నుంచి ఒకరు, గుంటూరు లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ నుంచి ఒకరు ఎంపికయ్యారు. ఈ జట్టు ఈనెల 6వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. సమ్మర్ క్యాంప్ ద్వారా ఫుట్‌బాల్ కోచింగ్ ఇవ్వడంతో ఉప్పలపాడు పాఠశాల నుండి 15 మంది ఎంపికయ్యారని, శ్రమకు తగిన ఫలితం దక్కిందని పీఈటీ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ఎంపికలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైనేని నాగేశ్వరరావు, ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జట్టు ఘన విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలు మూడో మ్యాచ్‌లో చిత్తూరుజిల్లా జట్టు 291 పరుగుల తేడాతో కర్నూలు జిల్లా జట్టుపై ఘన విజయం సాధించింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 374, రెండో ఇన్నింగ్స్‌లో 146 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులు చేసింది. కాగా, ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్లు నష్టానికి 20 పరుగుల స్కోర్‌తో గురువారం మూడో రోజు ఆట ప్రారంభించిన కర్నూలు జట్టు తన ముందున్న 407 పరుగుల భారీ లక్ష్య సాధనలో చతికిలపడింది. 116 పరుగులకే ఆలౌట్ అయింది. కర్నూలు బ్యాట్స్‌మెన్ జి.ఎస్.భరద్వాజ్ 44 పరుగులు సాధించగా, చిత్తూరు బౌలర్లు ఎం.ప్రకాష్, సి.సోహన్‌రెడ్డికి చెరో 3 వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం .. లింగంగుంట్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా కాచిగూడ నుంచి గుంటూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్ఐ తన్నీరు సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి తెలుపురంగు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసినవారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4400, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు



సత్తెనపల్లి: రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలు మినహా 95 శాతం సేవలు రోగులకు అందుతున్నాయన్నారు. ఓపీ విభాగం బాగా రద్దీగా ఉంటుందని, తాను పరిశీలించిన సమయంలో 350 మందికిపైగా రోగులు ఉన్నారన్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే వైద్య సేవలు బాగా మెరుగయ్యాయని చెప్పారు. స్కానింగ్, ల్యాబ్ పరీక్షలు బయటకు రాస్తున్నారని అప్పుడప్పుడు ఫిర్యాదులు వస్తున్నట్లు వివరించారు. ప్రధానంగా స్కానింగ్‌కు రేడియాలజిస్ట్ లేకపోవడం కొంత సమస్యగా ఉందని పేర్కొన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రైవేటు వైద్యశాలతో ఒప్పందం చేసుకునే యత్నం చేస్తున్నామని వివరించారు. ల్యాబ్ పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపించే అవసరం లేదని, అలా పంపిస్తే శాఖాపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ప్రైవేటు వైద్యశాలలో లేని అత్యాధునిక యంత్రాలు ఏరియా వైద్యశాల ల్యాబ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అంతకుముందు గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల మొత్తం క్షుణ్ణంగా పరిశీలించి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావుకు, వైద్యులకు పలు సూచనలు చేశారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తూనికలు, కొలతల శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ కంట్రోలర్ శామ్యూల్ రాజు



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

క్రోసూరు: వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, తూనికలు, కొలతలు, ధరలపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని తూనికల కొలతల శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ కంట్రోలర్ టి.శామ్యూల్ రాజు చెప్పారు. గురువారం క్రోసూరులోని పలు దుకాణాలు, వ్యాపారల సంస్థలలో తూనికలశాఖ అధికారులు సత్తెనపల్లి ఎస్ఐ షేక్ సైదాతో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మూడు చికెన్‌షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు ముద్రలు లేకపోవడం, తూకాల్లో తేడాలు ఉండటం గుర్తించి కేసులు పెట్టారు. రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనంలో కాటాకు ముద్రలేకపోవడంతోపాటు, ఆటోమొబైల్ షాపులో ప్యాకింగ్, కమోడిటీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్యాకింగ్ ఉండటాన్ని గుర్తించారు. అనంతరం పత్తి కొనుగోలు చేసే బ్రోకరేజీ కార్యాలయంలో కాటా తేడాగా ఉండటాన్ని గుర్తించి కేసులు పెట్టినట్లు శామ్యూల్‌రాజు తెలియజేశారు. అనంతరం వినియోగదారులకు అవగాహన కల్పించారు. వస్తువుల కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉంటే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఎవరైనా 0863–2223202కు ఫోన్ చేసి మోసాలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

గణపవరంలో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

నాదెండ్ల: గణపవరం గ్రామంలో గురువారం మరో చోరీ జరిగింది. గత నెల 24న రెండు ఇళ్లలో జరిగిన జంట చోరీలను ప్రజలు మరువకముందే మరో దొంగతనం వెలుగులోకొచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన మిరియాల రామకృష్ణ దంపతులు మంగళవారం రాత్రి హైదరాబాద్ వెళ్ళారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్ళగా, బీరువా తలుపులు ధ్వంసం చేసి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దుండగులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి రంపపు బ్లేడుతో బీరువాను కట్ చేశారు. బీరువాలోని రూ.22 వేల నగదు, రెండు పట్టుచీరలు, విలువైన దుస్తులు దొంగిలించారు. బాధితుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.